క్లుప్తంగా

లెగసీ వేస్ట్ శుద్ధీకరణ త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణ శివారు..భీమవరం రోడ్డులో ఏర్పాటు చేసిన డంప్‌యార్డులోని లెగసీ వేస్ట్‌ను త్వరగా శుద్ధీకరణ చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ అధికారులతో కలిసి డంప్ యార్డులో జరుగుతున్న లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శుద్ధీకరణ చేసేందుకు రూ.5.25 కోట్లతో సాగర్‌మోటార్స్ వారితో పనులు చేయిస్తున్నామన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించామన్నారు. ఇప్పటికే పని చేయడానికి అవసరమైన యంత్ర సామగ్రి ర్పాటు చేశారన్నారు. ఘనవ్యర్థాల ద్వారా వెలువడుతున్న విషవాయువుల కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే.. డంప్‌యార్డులో చెత్తను ఎరువుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం తగదు

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీలో ఉండి ముఖ్యమంత్రి స్థాయి పదవులను అనుభవించిన కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదని ఏపీసీసీ జనరల్ సెక్రటరీ చింతలమోహన్‌రావు అన్నారు. ఏ అర్హత లేకపోయినా తమ పార్టీ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన విషయాన్ని మరిచిపోరాదన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, రాష్ట్ర అధికారి ప్రతినిధి ఊకొట్టు వాసుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. చింతల మోహన్‌రావు మాట్లాడుతూ బీజేపీలో చేరినంత మాత్రన కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని విమర్శించడం తగదన్నారు.

చంద్ర రాజేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలి



రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(అర్బన్): భూ పోరాటాల యోధుడు, ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు పొందిన అమరజీవి కామ్రెడ్ చంద్ర రాజేశ్వరరావును యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న పిలుపునిచ్చారు. రాజేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తన ఆస్తుల్ని సైతం పేదలకు పంచి ఆదర్శమూర్తిగా నిలిచారని కొనియాడారు. నాయకులు శ్రీనివాసులు, ధనుంజయుడు, అస్లాంబాషా పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఐఎఫ్ఎస్ చిరంజీవి చౌదరి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని స్వామివారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట జీబీఎం ఎఫ్ఆర్ఓ త్రినాథ్, మహానంది డీఆర్ఓ సుబ్బయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వృద్ధుడి మృతి



మృతుడు మస్తాన్

ఆళ్లగడ్డ: పట్టణంలోని నంద్యాల రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని షేక్ మస్తాన్ (72) అనే వృద్ధుడు మృతి చెందాడు. నంద్యాల పట్టణానికి చెందిన మస్తాన్ రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద యాచన చేస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం నంద్యాల రహదారిలోని ఎస్‌పీఎమ్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని జేబులో ఉన్న కాగితంలో సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు బంధువులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

పేదల ఆశాజ్యోతి జగనన్న





చాబోలు గ్రామంలో మహిళ నుంచి మిస్డ్ కాల్ ఇప్పిస్తున్న ఎంపీ పోచా, 25వ వార్డులో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కౌన్సిలర్ కృష్ణమోహన్, గృహ సారథులు

నంద్యాల(రూరల్): అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుగాంచారని ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చాబోలు గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న-జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని గ్రామ నాయకులతో కలిసి నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి ఇంటికీ దాదాపు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అనేక రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి పథకాలను తిరిగి పొంది అభివృద్ధి చెందాలన్నారు. చంద్రబాబు హయంలో రాష్ట్రం కరువు కాటకాలతో తల్లడిల్లిపోయిందని, ఇప్పుడు సుభిక్షంగా ఉందని తేడాను వివరించారు. రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ కల్లూరు రామలింగారెడ్డి, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ మౌనిక, ఉప సర్పంచ్ ఉశేని బాషా, నాయకులు నాగనందినిరెడ్డి, మదర్‌సా, బాలవుశేని, తిమోతి, ఉమామహేశ్, రాజగోపాల్‌రెడ్డి, మధుగోపాల్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

నంద్యాల: సంక్షేమ పథకాలతో అండగా నిలిచిన సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజల మద్దతు ఉందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, కౌన్సిలర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 25వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గోస్పాడు, నంద్యాల మండలాల్లో గృహ సారథుల మండల కన్వీనర్లు రాజశేఖర్‌రెడ్డి, బసవేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో సాయిరాంరెడ్డి, దాల్‌మిల్ అమీర్ ఆధ్వర్యంలో 42 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధితో పాటు గత ప్రభుత్వాల పాలనను నేటితో పోల్చి వివరించి వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రజల మద్దతుతో వారి ఇంటికి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు.

రాయమాల్పురంలో..

నంద్యాల మండలం రాయమాల్పూరం గ్రామంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ గ్రామంలోని ఇంటింటికీ తిరిగి 'మా నమ్మకం నువ్వే జగన్-మా భవిష్యత్ నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

ఉయ్యాలవాడ : మండలంలో ఆదివారం ఆర్.జంబులదిన్నె, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, సర్వాయిపల్లె గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం కొనసాగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి, మండల బూత్ కన్వీనర్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు సరాబు ఉమా, ప్రసాద్, బందెల సువర్ణ, స్పోర్ట్ కమిటీ చైర్మన్ శివానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీ కాంతం రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను, పాలన తేడాలను వివరించి వారి అభిప్రాయాలను సేకరించారు.



ఆర్.జంబులదిన్నెలో పొందిన లబ్ధిని మహిళకు వివరిస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ: ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా విషప్రచారాలకు చెంపపెట్టుగా 'జగననన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతోందని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యాక్రమంలో భాగంగా రూరల్ మండలం యాదవాడలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధి చేకూరిన పథకాలు, అభివృద్ధి, టీడీపీ పాలన పడిన కష్టాలను వివరించారు. సర్పంచ్ సరస్వతి, సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు.



యాదవాడలో మహిళ అభిప్రాయాలు నమోదు చేసుకుంటున్న దృశ్యం

చోరీపై దర్యాప్తు ముమ్మరం

శిరివెళ్ల: స్థానిక కెనారా బ్యాంక్ సమీపంలో శనివారం జరిగిన చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీ జరిగిన మరుక్షణమే పోలీస్‌లు సీసీ కెమెరాల పుటేజీలను నిశితంగా పరిశీలించారు. ఆదివారం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని నివాసముంటున్న వీధిలోకి ఎవరెవరు వచ్చారు, ఎన్నిసార్లు తిరిగారు అనే కోణంలో పుటేజీలో పరిశీలించారు. ఎక్కువ సార్లు తిరిగిన వారి వివరాలు ఆ వీధిలో నివాసముంటున్న వారి ద్వారా కనుకున్నారు. దొంగతనంలో బయటి వారు పాల్గొన్నారా, లేక స్థానికుల హస్తం ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

నంద్యాల(వ్యవసాయం): యోగాతో మానసిక ఆరోగ్యాన్ని శారీరక దృఢత్వం పెంపొందుతుందని శ్రీరామచంద్ర మిషన్ గౌరవాధ్యక్షురాలు సుజల పేర్కొన్నారు. స్థానిక క్రాంతినగర్‌లోని రామచంద్ర మిషన్‌లో హార్ట్‌ఫుల్ నెస్ ధ్యానకేంద్రం, పద్మభూషణ్ శ్రీకమలేష్ పటేల్ సూచన మేరకు హర్‌దిల్ ధ్యాన్.. హరిదిన్ ధ్యాన్ యోగా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమంలో రామచంద్ర మిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీస్తు పునరుత్థానుడు



క్రిష్టిపాడులో దైవసందేశం ఇస్తున్న పాస్టర్ డేవిడ్ పుష్పరాజ్



ఆళ్లగడ్డలో క్రీస్తు పునరుత్థానంపై సందేశం ఇస్తున్న రెవరెండ్ ఏసురత్నం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు వేడుకగా జరుపుకున్నారు. సమాధి నుంచి క్రీస్తు తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణం, మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పల్లెల్లో రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. క్రీస్తు సజీవుడని రెవరెండ్ ఏసురత్నం సందేశం ఇచ్చారు.

దొర్నిపాడు: క్రీస్తు తిరిగి జన్మించినందుకు జరుపుకునే పునరుత్థానం (ఈస్టర్) పండుగను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జాము నుంచే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహలతో గడిపారు. అనంతరం నూతన దస్తులు ధరించి చర్చీలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. సమాధి వేయబడి క్రీస్తు పునరుత్థానుడు అయ్యాడని పాస్టర్ డేవిడ్ పుష్పరాజు దైవసందేశం ఇచ్చారు.

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో ఉదయాన్నే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలు పంచుకున్నారు. పలు గ్రామాల్లో ఆటపాటలతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు గ్రామ పంచాయతీల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉన్నవారు క్రీస్తు పునరుత్థాన దినం సందర్భంగా దీక్షలను విరమించి ప్రార్థనలు చేశారు. పెద్దకంబలూరు గ్రామంలో యువకులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే..చిన్న కంబలూరు గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.



ఒంటివెలగలలో రంగులు చల్లుకుంటున్న యువకులు

ముగిసిన సుందరకాండ మహాయజ్ఞం



పూర్ణాహుతి గావిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుందరకాండ మహాయజ్ఞం ఆదివారం ముగిసింది. వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ, నటరాజ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు నిర్వహించి సుందరకాండ యజ్ఞం, జయాది హోమం, శ్రీరామ పట్టాభిషేకం, ఆహావనం తదితర హోమాలు నిర్వహించారు. అనంతరం 11 హోమాల్లో మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, హోమ రక్షధారణ తదితర కార్యక్రమాల అనంతరం వేదపండితులతో మహా ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు శిరివెళ్లకు ఎమ్మెల్యే రాక

శిరివెళ్ల: ఈ నెల 10వ తేదీన మండల కేంద్రానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. షాధిఖానా ఆవరణలో ఆసరా 3వ విడత రుణమాఫీ చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కాదరబాదరలో గడప గడపకు..

శిరివెళ్ల 4వ గ్రామ సచివాలయ పరిధిలోని కాదరబాదర గ్రామంలో అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఎమ్మెల్యే పాల్గొని సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి సమస్యలను తెలుసుకుంటారని.. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని సూచించారు.

భయపెడుతున్న ఎండలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఉయ్యాలవాడ : ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు జనాన్ని భయపెడుతున్నాయి. భానుడి భగ భగతో ఉష్ణోగ్రతలు రోజురోజుకు అధికమవుతున్నాయి. ఉదయం 9 గంటలకే ఎండ సుర్రుమంటోంది. 39 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పదిగంటల తరువాత బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు ఉదయం ఆరు గంటలలోపే పనుల్లోకి వెళ్లి పది నుంచి పదకొండు గంటల్లోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. నాలుగు రోజులుగా ఎండలు ముదరడంతో మధ్యాహ్న సమయంలో ప్రధాన వీధులు సైతం జనసంచారం లేక బోసిపోతున్నాయి. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కలింగర, తాటిముంజలు, కర్బూజా, కూల్‌డ్రింక్ తదితర వాటిని ఆశ్రయిస్తున్నారు. కాగా.. ఎండలు మండుతున్నందున వృద్ధులు, చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే వడదెబ్బ బారిన పడే అవకాశముందని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శివలింగమ్మ తెలిపారు.

వడదెబ్బ లక్షణాలు..

- 102 డిగ్రీలు జ్వరం, తీవ్ర తలనొప్పి, దప్పిక ఉండి నాలుక పిడుచుకట్టకపోతుంది.
- జ్వరం తగ్గిన నీరసంగా వుంటుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం.



ఉయ్యాలవాడలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి, (ఇన్‌సెట్)-శివలింగమ్మ, వైద్యాధికారిణి, పెద్దయమ్మనూరు

తీసుకోవలసిన జాగ్రత్తలు..

- ఉదయం 10 గంటల్లోపు సాయంత్రం 5 గంటల తరువాత బయటి పనులు పూర్తి చేసుకోవాలి.
- మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలి. రోజుకు 5 లీటర్లకు తక్కువ కాకుండా తీసుకోవాలి.
- నూనె, కొవ్వు పదార్థాల ఆహారం తీసుకోవడం తగ్గించుకోవాలి.
- పండ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరినీరు ఎక్కువ తీసుకోవాలి.
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ ధరించాలి.
- వడదెబ్బ సోకిన వ్యక్తులకు చల్లటి నీరు తాపకూడదు.
- నీడ ప్రదేశంలో పడుకోబెట్టి మామూలు కుండనీరు తాపించాలి. తడిగుడ్డతో శరీరం తుడవాలి.
- జ్వరం మాత్రలు వేయడంతో పాటు ఓఆర్ఎస్ అవసరమైన ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పుతో కలిపిన గ్లూకోజు తాపించాలి.
- గాలి బాగా తగిలే నీడ ప్రదేశంలో విశ్రాంతి తీసుకోనివ్వాలి.
- ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై మరమ్మతులు





కోటకొండ సమీపంలో కట్టపై పనులు చేస్తున్న యంత్రాలు, మట్టితోలి చదును చేయడంతో విశాలంగా మారిన కట్ట

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై ఆ శాఖ అధికారులు కోట్లాది రూపాయలతో మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు సులభతరంగా మారింది. మూడు దశాబ్దాల క్రితం తెలుగుగంగ కాల్వను నిర్మించి వదిలేశారు. నాటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రధాన కాల్వతో పాటు ఉప ప్రధాన కాల్వలు దెబ్బతిన్నాయి. అలాగే తెలుగు గంగ కాల్వ అధిక భాగం అటవీ ప్రాంతంలో ఉండటంతో కాల్వ కట్టలకు ఇరువైపులా వివిధ జాతుల చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి ఆ శాఖ అధికారుల వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారాయి. అలాగే వర్షాలు అధికంగా కురిసినప్పుడు, నీటి ప్రవాహం పెరిగినప్పుడు కట్టలు దెబ్బతిని గండ్లు పడ్డాయి. గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగా పనులు చేసి కాల్వలను గాలికి వదిలేయడంతో ఉప ప్రధాన కాల్వల్లో నిర్మించిన కల్వర్టులు కూలి పోయాయి. పరిస్థితి గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాల్వలను బలోపేతం చేసేందుకు కోట్లాది రాపాయలు మంజూరు చేసిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. వీటితో కాల్వ కట్టలకు ఇరువైపులా ఉన్న చెట్లు, ముళ్ల పొదలను తొలగించి, మట్టి తోలించి చదును చేస్తున్నారు. ప్రస్తుతం గాజులపల్లె వైపు నుంచి మండల పరిధిలోని కోటకొండ వైపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాల్వ కట్ట గతంలో ఇరుకుగా ఉండేదని, ప్రస్తుతం వెడల్పు పెంచి మరమ్మతులు చేయిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయని కోటకొండ గ్రామస్తులు పేర్కొంటున్నారు.



అప్పనపల్లె సమీపంలో పచ్చదనం పులుముకున్న కొండ

అడవి చిగురించే..

రుద్రవరం: ఎండలు మండుతున్నాయి. భానుడి భగభగలకు ఏటా ఈ సమయంలో నల్లమల అడవి ఎండిపోయి ఉంటుంది. దీంతో అడవంతా బయలు ప్రదేశాన్ని తలపిస్తుంది. అయితే గతనెలలో కురిసిన రెండు వర్షాలకు మోడువారిన చెట్లన్నీ చిగురించడంతో లేలేత ఆకులతో కొండకు పచ్చందం సమకూరింది. మండల కేంద్రానికి సమీపంలోనున్న అడవీ ప్రాంతంలో పచ్చదనం పులుముకోవడంతో పర్యావరణ ప్రేమికులు అందాలను తిలకించి ఆహ్లాదం పొందుతున్నారు.

అత్యవసర చికిత్సలు అందుబాటులోకి రావాలి

నంద్యాల(వ్యవసాయం): ప్రజలందరికీ అత్యవసర చికిత్సలు అందుబాటులోకి రావాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. నంద్యాల క్రిటికల్ కేర్ సెంటర్, ఇండస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్, నంద్యాల ఇన్‌టెన్సివ్ ట్రామా కేర్ ఆసుపత్రుల నిర్వహణలో స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అత్యంత ఆధునిక వైద్య సదస్సు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. సదస్సులో ఆధునిక వైద్య విధానాలు, చికిత్స ప్రక్రియలపై పలు రాష్ట్రాల నుంచి హాజరైన వైద్యులకు అవగాహన, శిక్షణ ఇవ్వడం వల్ల ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. డీసీహెచ్ జఫరుల్లా, వైద్యులు సుబ్బారెడ్డి, విజయభాస్కరరెడ్డి, అనిల్‌కుమార్, రాకేష్‌రెడ్డి, హరినాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సహదేవుడు, మధుసూదనరావు, నాగమణి, వసుధ, సౌజన్య, మాధవి ఇతర ప్రాంతాల నుంచి 250 మంది వైద్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

ఉయ్యాలవాడ : చిరుధాన్యాలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చుననే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచనల మేరకు కొందరు రైతులు రబీలో ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపారు. మండలంలోని ఆర్.పాంపల్లె, కాకరవాడ, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, ఒంటిద్దుపల్లె, తదితర గ్రామాల పరిధిలో 39 ఎకరాల్లో కొర్రలు, అరికలు, నువ్వులు, సజ్జలు, 26 మంది రైతులు సాగు చేశారు. వరి పంటతో పోలిస్తే నీటి తడులు తక్కువగా అవసరమవుతాయని, రెండు తడులతో పంట పండుతుండటం, 60 నుంచి 70 రోజుల వ్యవధిలోనే పంటలు చేతికి అందుతాయని రైతులు పేర్కొంటున్నారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు కొర్రలు మంచి ఆహారమని వైద్యులు సూచిస్తుండడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం కూడా పౌష్టికాహారంలో భాగంగా గర్భిణులు, తల్లులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.



ఆర్.పాంపల్లె సమీపంలో సాగు చేసిన కొర్ర పంట